

సుంకిడిలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 నిజామాబాద్ సోమవారం 24 జూన్ 2024 ADILABAD NIRMAL

## పాక్‌పట్లలో గంగనీళ్ల జాతర



గోదావరి నది నుంచి గంగనీళ్లను తీసుకొస్తున్న మహిళలు

సోన్, జూన్ 23 : సోన్ మండలంలోని పాక్‌పట్లలో ఆదివారం గంగనీళ్ల జాతర వైభవంగా కొనసాగింది. గోదావరికి వెళ్లి గంగనీళ్లను తీసుకొచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఈ యేడాది బాగా వర్షాలు కురిసి పంటలు పండాలని, చల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

### పస్కరాజులకు పూజలు

నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు పస్క రాజులకు పూజలు నిర్వహించారు. గ్రామస్తులు గ్రామ శివారులోకి వెళ్లి అక్కడే పూజలు చేసి వన భోజనాలు చేశారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 23 : సిరికొండ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి కాల్వలు నిర్మిస్తామన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తిరుగు ప్రయాణంలో ఆదివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో సుంకిడి గ్రామంలో వద్ద పిల్లలు కనిపించడంతో అప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పెంటన్న, పాండురంగ్, ఎంపీటీసీ ఇక్బాల్, ఉప సర్పంచ్ చందు, పీఏసీఎస్ డైరెక్టర్ రాజన్న, సర్పంచ్‌లు సూర్యకాంత్, రోహిదాస్, మహేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయి చైతన్య, జనార్దన్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశీ రాజేశ్వర్ వారం రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కాంబ్లే వివేకానంద సోదరి కాంబ్లే ఆర్తీక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీలు గాడ్గె సుభాస్, మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి ఉన్నారు.



క్లిక్..క్లిక్..

ఇంద్రవెల్లి : మక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు, కూలీలు

# రైతన్న బిజీ బిజీ

## వరుణుడు కరుణించడంతో పొలంబాట

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- నాలుగు రోజులుగా వానలు
- పత్తి, సోయా విత్తనాలు వేస్తున్న రైతులు

ఆదిలాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ) : వానకాలం వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పత్తి, సోయా విత్తనాలు వేశారు. జూన్ మొదటి, రెండో వారంలో విత్తనాలు నాటగా వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందారు. విత్తనాలు నష్టపోయే ప్రమాదం నెలకొనగా కొందరు రైతులు స్ప్రింక్లర్ల ద్వారా విత్తనాలకు నీటిని అందించారు. వారం రోజుల క్రితం కురిసిన వర్షం రైతులను నష్టాల బారి నుంచి కాపాడింది. భూమిలో 60 శాతం తేమ వచ్చిన తర్వాత విత్తనాలు వేయాలని అధికారులు సూచించడంతో పత్తి విత్తనాలు వేయకుండా ఆగారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భూమిలో తేమ శాతం పెరిగింది. వరుణుడు కరుణించడంతో పత్తితో పాటు సోయా వేస్తున్నారు.

### సాధారణం కంటే తక్కువ వర్షపాతం

జిల్లాలో యేటా 1,200 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదవుతున్నది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 131 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 117 మి.మీ వర్షం పడింది. నాలుగు రోజుల కిందట సాధారణం కంటే సగం వర్షపాతం కూడా నమోదు కాలేదు. మూడు రోజులుగా పడుతున్న వానలతో దాదాపు సాధారణ వర్షపాతానికి చేరింది. జిల్లాలో 18 మండలాలు ఉండగా 16 మండలాల్లో సాధారణం.. మావల, నేరడిగొండ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. ఐదు రోజుల క్రితం వరకు జిల్లాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.



ఇంద్రవెల్లి : ఎడ్లబండిలో వ్యవసాయ పనిముట్లు, తిప్పన్, ఎరువులు, విత్తనాలు తరలిస్తున్న రైతులు



విత్తనాలు నాటేందుకు ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తున్న రైతు



బోథ్ : పత్తి విత్తనాలు వేస్తున్న మహిళలు



రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, క్రీడాకారులు

## క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

### ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, జూన్ 23 : ఎల్లప్పుడు క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. జాతీయ ఒలింపిక్ డేను పురస్కరించుకుని ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రన్‌ను నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని జ్యోతిని వెలిగించి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల కరాటే విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించిన తరువాత క్రీడాకారుల నైపుణ్యాలు, సాధించిన పతకాలు అనేకం అన్నారు. ఖేలో ఇండియాలో ఆదిలాబాద్‌కు కావాల్సిన వసతులను ఎంపీ నగేశ్ సహకారంతో పూర్తి చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పదోన్నతులు పొందిన వ్యాయామ ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పేట సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిచరణ్ పాల్గొన్నారు.

## పోలీసు అధికారులకు సేవా పథకాలు

ఎదులాపురం, జూన్ 23 : విధినిర్వహణలో విశిష్ట సేవలు అందించిన 20 మంది పోలీసు అధికారులకు సేవా పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఒక ఉత్తమ సేవ, 19 సేవా పథకాలను అందుకోకున్నారు. ఉత్తమ సేవా పథకం పి.యువరాజ్ (పీఏర్ ఆదిలాబాద్), సేవా పథకాలు జీవీ రమణారెడ్డి(ఎస్ఐ, బోథ్), బి.శివరామ్(ఎస్ఐ, తాంసి), ఎన్.ముకుంద్‌రావు(ఏఎస్ఐ, ఉట్నూర్ పీఎస్), కె.రమేశ్ (ఏఎస్ఐ, నేరడిగొండ), కె.భీంరావు(ఏఎస్ఐ, ఇంద్రవెల్లి), ఆర్.ఆత్మారాం (ఏఎస్ఐ, మహిళా పోలీస్ స్టేషన్), ఆర్.బలిరామ్(ఏఎస్ఐ, గుడిహత్నూర్), ఆర్.గణపతి(ఏఎస్ఐ, భీంపూర్), వెంకటమ్మ(ఏఎస్ఐ, వన్‌టౌన్), ఎం.జయలక్ష్మి(ఏఎస్ఐ, టూటౌన్), ఎన్.పోశెట్టి(ఏఆర్ఎస్ఐ, ఆదిలాబాద్), ఎస్.లక్ష్మణ్(ఏఆర్ఎస్ఐ, ఆదిలాబాద్), కె.గణపతి(హెడ్‌సీ, తాంసి), కె.వెంకట్‌రావు(హెచ్‌సీ, జైనథ్), ఎస్.రాజన్న(ఏఆర్ హెచ్‌సీ), ఎండీ జఫర్ ఉద్దీన్(ఏఆర్‌హెచ్‌సి), షేక్ అమీర్ (ఏఆర్‌హెచ్‌సీ), జె.దేవిదాస్(పీసీ, ఇంద్రవెల్లి), బి.సురేశ్(ఏఆర్ఎస్ఐ)ఉన్నారు. ఈ మేరకు ఎస్పీ గౌష్ ఆలం వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఆదర్శ ఉపాధ్యాయుల ఆందోళ న బాట

### నేటి నుంచి 29 వరకు నిరసన కార్యక్రమాలు

దండేపల్లి, జూన్ 23 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నేటి(సోమవారం) నుంచి 29వ తేదీ వరకు ఆందోళన బాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు రూపొందించారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉండగా, 160 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

#### ఆదర్శ ఉపాధ్యాయుల డిమాండ్లు..

- బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.
- 010 పద్దు ద్వారా వేతనం చెల్లించాలి.
- హెల్త్ కార్డులు జారీ చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- హిందీ పీజీటీ పోస్టు ఏర్పాటు చేయాలి.
- పీజీటీలను జేఎల్‌లుగా ఉన్నతీకరించాలి.
- ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- కారుణ్య నియామకాలు చేపట్టాలి.

#### నిరసన కార్యక్రమాలు..

- ఈనెల 24న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావడం.
- 25, 26 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనతోపాటు సీఎంవో విద్యాశాఖ కార్యదర్శికి ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం.
- 27న తహసీల్దార్, మండల విద్యాధికారులకు వినతిపత్రాల అందజేత.
- 28న కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, 29న పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించడం.

#### ధర్నాకు దిగుతాం..

*నేటి నుంచి 29 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నాం. ప్రభుత్వం పట్టించుకోకపోతే ధర్నాకు దిగుతాం.*

*- ఎత్రజ్ రాజు, జిల్లా మోడల్ స్కూల్ అసోసియేషన్ కన్వీనర్.*





సీజ్ చేసిన నిషేధిత గుట్కా బ్యాగులు

## రూ.77.60 లక్షల గుట్కా స్వాధీనం

- అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్.. ఐదు గోదాములు సీజ్
- ఐదుగురిపై కేసు నమోదు

ఎదులాపురం, జూన్ 23 : ఆదిలాబాద్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి ఎస్పీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రూ.77,60,586 విలువ చేసే నిషేధిత గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ గౌష్ ఆలం వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని 4, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక గోదాములో తనిఖీలు చేయగా రూ.77,60,586 విలువ చేసే నిషేదిత గుట్కా లభించిందన్నారు. సాజీద్‌ఉల్లాఖాన్, ఫసిఉల్లాఖాన్‌లు అరెస్టు కాగా.. అస్లాంఖాన్, సమీఉల్లాఖాన్, అర్బాజ్ అలీలు పరారీలో ఉన్నారని తెలిపారు. పరారీలో ఉన్నవారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గుట్కాను సమూలంగా రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రత్యేక సిబ్బందిని నియమించామని, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తూ విధులను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ఈ దాడిలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు కే.సత్యనారాయణ, ఏ.అశోక్, ఏ.రామాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

నిర్మల్ అర్బన్, జూన్ 23 : నిర్మల్ పట్టణంలోని సోఫినగర్ కాలనీలో గల ప్రసిద్ధ హజరత్ సోఫి అహ్మద్ అలీషా ఖాద్రీ (ఉర్సు షరీఫ్) ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన ముస్లింలు భారీసంఖ్యలో తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఉత్సవాలను నిర్వహిస్తున్న ముస్లింలు

## ముగిసిన ఆర్జీయూకేటీ ప్రవేశాల దరఖాస్తు గడువు

బాసర, జూన్ 23 : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆర్జీయూకేటీ బాసరలో ఆరేండ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యనభ్యసించడానికి ప్రవేశాల దరఖాస్తు గడువు ముగిసింది. మొత్తం 15 వేల పైచిలుకు అప్లికేషన్లు వచ్చాయని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన ఈ నెల చివరి వరకు పూర్తి చేస్తామని, జూలై 3వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జూలై 8,9,10 తేదీల్లో సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఉంటుందని యూనివర్సిటీ అధికారులు వెల్లడించారు. కాగా.. గత సంవత్సరం కంటే ఈసారి ట్రిపుల్ ఐటీకి దరఖాస్తులు తగ్గాయి. గతంలో పదో తరగతి ఫలితాలు విడుదల అయిన వెంటనే నోటిఫికేషన్ వచ్చేది. కానీ.. ఈసారి నోటిఫికేషన్ విడుదల కావడం ఆలస్యం అవడంతో పలువురు విద్యార్థులు ప్రైవేటు కాలేజీలను ఆశ్రయించారు. దీంతో దరఖాస్తులపై ప్రభావం పడ్డట్లయింది.

## పనిచేస్తేనే గుర్తింపు

### ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, జూన్ 23 : విధి నిర్వహణలో భాగంగా కష్టించి ప్రతిభతో పనిచేసే పోలీసు అధికారులకు దానంతట అదే గుర్తింపు వస్తోందని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు పతకాలను అందుకోనున్న అధికారులను ఎస్పీ ఆదివారం అభినందించారు. నిర్మల్ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లు, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసే వారికి పతకాలను ప్రకటించారు. భైంసా టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై గౌస్, కడెం పోలీసు స్టేషన్ ఏఆర్ ఎస్సై గుణ్వంత్, ఏఆర్‌హెచ్‌సీ అంబారావు, ముథోల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ ఉత్తమ్‌లకు అభినందించారు.



సేవా పతకాలు పొందిన పోలీసు అధికారులు



## వర్షాలు కురవాలని..

*వర్షాలు కురవాలని లింబా(కే)లో ఆదివారం అరెల్లి మైసమ్మను నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచికల్‌పాడ్‌తోపాటు ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గంగాజలంతో గ్రామదేవతలకు పూజలు చేసి వర్షాలు సమృద్ధిగా కురిసి సమృద్ధిగా పంటలు పండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు.*

*- కుంటాల, జూన్ 23*

పూజలు చేస్తున్న లింబా(కే) గ్రామస్తులు